
హత్నూరలో బోనాల ఊరేగింపు


ఝరాసంగం: బోనాలతో ఆలయానికి వెళుతున్న భక్తులు


నారాయణఖేడ్‌లో..


రామచంద్రాపురం(పటాన్‌చెరు): బోనాల వేడుకల్లో భెల్ అధికారులు

బోనం.. వైభోగం

జిల్లావ్యాప్తంగా ఆషాఢ మాస బోనాలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం మహిళలు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం బోనాల ఊరేగింపు చేపట్టారు. డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.


మునిపల్లి(అందోల్): ఖమ్మంపల్లిలో..

క్లుప్తంగా

అన్ని రంగాల్లో అభివృద్ధి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ కుమార్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): నూతనంగా ఏర్పడిన గుమ్మడిదల మండలంలో గత నాలుగేళ్లలో రూ.10.85 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం గుమ్మడిదల గ్రామ పంచాయతీ కార్యాలయంలో అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మండలవ్యాప్తంగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో గుమ్మడిదల సర్పంచ్ నర్సింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు హుస్సేన్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి


ధ్రువపత్రాలు అందజేస్తున్న రైతులు

హత్నూర(సంగారెడ్డి): రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని జోగిపేట వ్యవసాయ శాఖ ఏడీఏ అరుణకుమారి రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని హత్నూర రైతు వేదికను సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టాదారు పాస్ బుక్ ఉన్న రైతులు తప్పకుండా రైతు బీమాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా దుర్గాభవాని



సంగారెడ్డి టౌన్: మండలంలోని ఇస్మాయిల్‌ఖాన్ పేటలోని సప్తప్రాకారయుత దుర్గా భవానిమాత ఆలయంలో అమ్మవారిని శనివారం శాకంబరీదేవిగా అలంకరించారు. ఆలయ పూజారి బ్రహ్మశ్రీ కమలంపేట రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'చింతా'ను కలిసిన అర్చకులు


అర్చకులతో చింతా ప్రభాకర్

సంగారెడ్డి అర్బన్: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో చింతా ప్రభాకర్‌ను శుక్రవారం అర్చకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈసందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మొత్తం 32 మంది అర్చకులకు దూప దీప నైవేద్యం కింద ఒక్కొక్కరికి రూ. 10,000 చొప్పున అందిస్తున్నట్టు చెప్పారు. అనంతరం అర్చకులు వేద మంత్రాలతో చింతా ప్రభాకర్‌ను ఆశీర్వదించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

జహీరాబాద్: ఈనెల 23వ తేదీన ఓల్డ్ పెన్షన్ స్కీం (ఓపీఎస్) జాయింట్ ఫోరం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన ఐక్యతా సదస్సు వాల్‌పోస్టర్‌ను శుక్రవారం జహీరాబాద్‌లోని ఎంఆర్‌సీ భవనం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో టీపీటీఎఫ్, టీఎస్ యూటీఎఫ్, బీటీఎఫ్ఐ, ఏఐఆర్ఎఫ్, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం అంతం చేయడమే ఓపీఎస్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు జనార్దన్ రెడ్డి, బిచ్చయ్య, శ్యాం, నాగేశ్వర్‌రావు, జీవన్ రావు, రాంతీర్థ్ నర్సింహులు, జగన్మోహన్, సమియోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం

◆ పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


రైతులకు గోవులను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: కుటుంబ పోషణలో అండగా నిలిచే గో సంపదను రైతులకు అందించి మరోసారి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి గొప్ప మనసు చాటుకున్నారు. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట, సుల్తాన్‌పూర్ గ్రామాలతో పాటు గుమ్మడిదల మండల పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన రైతులకు బీరంగూడ గోశాల నిర్వాహకులతో చర్చించి 40 ఆవులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో గుమ్మడిదల మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు సంబంధించిన గేదెలు, ఆవులు వివిధ కారణాలతో మృతి చెందాయని.. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. ఇప్పటివరకు 40 గోవులను అందించామని.. త్వరలోనే మరిన్ని పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, కృష్టారెడ్డిపేట సర్పంచ్ కృష్ణ, తహసీల్దార్ దశరథ్, ఎంఈఓ రాథోడ్, సీనియర్ నాయకులు రాజు, గోశాల నిర్వాహకులు దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): ప్రతి కార్యకర్తకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని బొంతపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వీరాచారి ఇటీవల మృతి చెందాడు. పార్టీ తరఫున రూ. 2 లక్షలు ప్రమాద బీమా మంజూరు కాగా ఇందుకు సంబంధించి చెక్కును కుటుంబ సభ్యులకు శుక్రవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వినోద్‌గౌడ్, గౌరీశంకర్‌గౌడ్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పులమయం

◆ మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ


ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న దామోదర రాజనర్సింహ

మునిపల్లి(అందోల్): సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులమయం చేశారని మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని మక్తక్యాసారంలో దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తుల సమక్షంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పేదలకు భూ పంపిణీ చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ భూములను తీసుకోవడమే పనిగా పెట్టుకుందన్నారు. మక్తక్యాసారం బెల్ట్ షాపుల ద్వారా ప్రభుత్వానికి సంవత్సరానికి కోటి 80 లక్షల రూపాయల ఆదాయం వస్తుందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటిస్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. ప్రతి ఓటరు ఎన్నికలను పండగగా కాకుండా బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. అనంతరం మునిపల్లిలో కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి, పెద్దగోపులారం ఎంపీటీసీ పాండు, వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ దుర్గయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్, మాజీ సర్పంచ్ చంద్రయ్య, నాయకులు శేఖర్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

హత్నూర(సంగారెడ్డి): నేటి సమాజంలో మానసిక దృఢత్వంతో పాటు శారీరక దృఢత్వం ఎంతో అవసరమని సర్పంచ్ మచ్చ విజయలక్ష్మి నరేందర్, ప్రధానోపాధ్యాయులు సత్యం అన్నారు. శుక్రవారం మండలంలోని సిరిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో బాలికలకు ఉచిత మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఇచ్చారు. ఇందులో బ్లాక్ బెల్ట్ సాధించిన 20 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు బెల్టులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆపద సమయంలో ఆత్మరక్షణ విద్యగా మార్షల్ ఆర్ట్స్ ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యం, సర్పంచ్ విజయలక్ష్మి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.



రావి ఆకుపై ఇస్రో చైర్మన్ చిత్రం

నారాయణఖేడ్: ఇస్రో చేపట్టిన మూడో మిషన్ చంద్రయాన్– 3 చరిత్రలోనే అత్యంత క్లిష్టమైన భారీ ప్రయోగం. ఇది విజయవంతం కావడంతో హర్షం వ్యక్తం చేస్తూ నారాయణఖేడ్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు గుండు శివకుమార్ ఇస్రో చీఫ్ సోమనాథ్ చిత్రాన్ని రావి ఆకుపై గీసి శుభాకాంక్షలు తెలిపారు.

20న తైబజార్ వేలం పాట

వట్‌పల్లి(అందోల్): అందోలు– జోగిపేట మున్సిపాలిటీకి ఆదాయం పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కరోనాతో రెండేళ్లుగా బహిరంగ వేలం పాట నిర్వహించకపోవడంతో మున్సిపల్ సిబ్బంది చేత వసూలు చేయించారు. దీంతో అనుకున్న స్థాయిలో మున్సిపాలిటీకి ఆదాయం రాకపోవడంతో మళ్లీ వేలం పాట నిర్వహించేందుకు అధికారులు, పాలకవర్గ సభ్యులు నిర్ణయించారు. ఆగస్టు 1 నుంచి మార్చి 31, 2024 వరకు తైబజార్ వసూలు చేసుకునేందుకు గానూ ఈనెల 20వ తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నారు. వేలం పాటలో పాల్గొనే వారు మున్సిపాలిటీకి ఎలాంటి బకాయి ఉండకూడదని.. మున్సిపల్ కమిషనర్ పేరిట డీడీని తీసి ఈనెల 19వ తేదీ మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని కమిషనర్ తిరుపతయ్య వెల్లడించారు.



నోట్ పుస్తకాల పంపిణీ

నోట్ పుస్తకాలతో విద్యార్థులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లోని జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం ఎస్ఆర్ ట్రస్ట్ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ ఉపాధ్యక్షుడు సురేందర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, రాజిరెడ్డి, వంశీ, కృష్ణ, విష్ణు, వీణ, శాంతి పాల్గొన్నారు.

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని కోనంపేట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు నోట్ బుక్‌లను పంపిణీ చేశారు. పార్కర్ హనీ ఫిన్ ఇండియా వారి సహకారంతో మెద్వాన్ స్వచ్ఛంద సంస్థ వారు అందజేశారు. కార్యక్రమంలో మెద్వాన్ డైరెక్టర్ హెచ్ మధుసూదన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు నాగరత్నం, ఉపసర్పంచ్ ధనలక్ష్మి, వార్డు మెంబర్ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు ఏర్పాట్లు చేస్తున్నాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆషాఢ మాసం బోనాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేటర్ పుష్పనగేష్ శుక్రవారం తెలిపారు. పాత రామచంద్రాపురంలోని పోచమ్మ ఆలయం వద్ద గ్రామ పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివారం జరగనున్న బోనాలకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ కుమార్ గౌడ్, నాయకులు వెన్నవరం మోహన్ రెడ్డి, మల్లారెడ్డి, సంతోష్ రెడ్డి, కిరణ్ గౌడ్, చిగురు శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు**

పటాన్‌చెరుటౌన్: తెలంగాణ సంస్కృతికి బో నాలు ప్రతీకగా నిలుస్తాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. పట్టణంలోని బండ్లగూడలో గురువారం నిర్వహించిన బోనాల మహోత్సవానికి సాయంత్రం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆర్థిక సాయం**

జిన్నారం(పటాన్‌చెరు): ఫలక్‌నుమా రైలు ఘటనలో పలువురిని కాపాడిన రాజు ఇటీవల అస్వస్థతకు గురయ్యాడు. జిన్నారం మండలంలోని బొల్లారంలో నివాసం ఉంటున్న రాజు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చులకు గానూ బీజేపీ నాయకుడు రవీందర్‌రెడ్డి శుక్రవారం రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు.

◆ **సన్మానం**

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సంగారెడ్డిని శుక్రవారం నాయకులు సన్మానించారు. బీఆర్ఎస్ నేత యాదిరెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

◆ **పాఠ్యపుస్తకాలు వెంటనే అందించాలి**

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని వైఎస్సార్‌టీపీ విద్యార్థి విభాగం నాయకుడు నరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జోగిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందలేదన్నారు. విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు కార్తీక్, శ్రీమంత్, భాస్కర్, మధు, తదితరులు పాల్గొన్నారు.

◆ **నేడు నీటి సరఫరా బంద్**

నారాయణఖేడ్: పట్టణ శివారులోని సంపు వద్ద విద్యుత్ మోటార్లకు సంబంధించిన సమస్య తలెత్తిందని మున్సిపల్ తాగునీటి సరఫరా విభాగం ఇన్‌చార్జి శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈనేపథ్యంలో నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రాంతీయ ఆస్పత్రి, ఎడ్ల బజార్, పెద్దమసీదు, శ్రీరామ మందిరం వద్ద గల తాగునీటి ట్యాంకుల పరిధిలోని కాలనీల్లో శనివారం తాగునీటి సరఫరా ఉండదన్నారు. ఆయా కాలనీల వాసులు గమనించి సహకరించాలని కోరారు.

◆ **ట్రాఫిక్ సిగ్నల్ ప్రారంభం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ నుంచి తెల్లాపూర్ వెళ్లే మార్గంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్‌ను శుక్రవారం తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత సోమిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, కమిషనర్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ సంజయ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్, కౌన్సిలర్లు బాలజీ, నాగరాజు, తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

◆ **బీమా చెక్కు అందజేత**

నారాయణఖేడ్: నిజాంపేట మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సభ్యుడు అలిగే బాగయ్య ప్రమాదవశాత్తు మృతిచెందాడు. పార్టీ ద్వారా బీమా చేయించడంతో నామినీగా ఉన్న తల్లి ఆగవ్వకు రూ. 2 లక్షలు మంజూరు కాగా శుక్రవారం నారాయణఖేడ్ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, సర్పంచ్ జగదీశ్వరాచారి, బీఆర్ఎస్ నాయకుడు రోషన్‌రెడ్డితో కలిసి శుక్రవారం చెక్కును అందజేశారు.

◆ **ఎల్‌ఓసీ అందజేత**

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండలం ఖాజాపూర్‌కు చెందిన లక్ష్మగౌండ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అత్యవసర చికిత్సల ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 2.50 లక్షల ఎల్‌ఓసీ ఉత్తర్వులు జారీ కాగా శుక్రవారం ఎమ్మెల్యే కుమారుడు రోషన్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించి ఎల్‌ఓసీ అందజేశారు.

◆ **రేపు బోనాల మహోత్సవం**

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మహంకాళీనగర్‌లోని ముత్యాల పోచమ్మ ఆలయంలో ఈనెల 16న ఆషాఢ బోనాల మహోత్సవాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

◆ **గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు**

నారాయణఖేడ్: నారాయణఖేడ్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ (ఒకేషనల్) గ్రూపుల్లో ఖాళీల భర్తీ కోసం అర్హత గల టెన్త్ ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి ఈనెల 15 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సాయిరెడ్డి తెలిపారు. దరఖాస్తుతో పాటు ధృవీకరణపత్రాలు అందజేయాలని సూచించారు.

◆ **విద్యార్థికి సన్మానం**

హత్నూర(సంగారెడ్డి): విద్యార్థులు ఉన్నత చదువులు చదివి పాఠశాల, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని హెచ్ఎం సత్యం, సర్పంచ్ మచ్చ విజయలక్ష్మి నరేందర్ సూచించారు. మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన గణేష్ బాసర ట్రిబుల్ ఐటీలో సీటు సంపాదించాడు. ఈమేరకు శుక్రవారం సర్పంచ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం గణేష్‌ను సన్మానించారు.

◆ **నేడు శనిత్రయోదశి పూజలు**

పటాన్‌చెరు: పట్టణంలోని టోల్ గేట్ సమీపంలోని మంజీరా క్యాంపస్‌లో ఉన్న రామలింగేశ్వర దేవస్థానంలో శని త్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకుడు మహేష్ తెలిపారు. శనివారం ఉదయం శనీశ్వరస్వామికి తైలాభిషేకం, శివాభిషేకం నిర్వహిస్తామన్నారు.

◆ **పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేయాలి**

నారాయణఖేడ్: రెవెన్యూ, అటవీశాఖ అధికారులు ఉమ్మడి సర్వేచేసి తమకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని నిజాంపేట మండలం గడ్డతండాకు చెందిన బాధితులు కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. తండాకు సమీపంలో ఉన్న నాగధర్ రెవెన్యూ గ్రామ పరిధిలో పది కుటుంబాలకు 15 ఎకరాల భూమికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందన్నారు. తాము ఆ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్నామని తెలిపారు. కొన్ని చోట్ల సర్వే నిర్వహించి ధరణి ప్రవేశపెట్టాక కొత్త పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వగా.. తమకు సంబంధించి సర్వే చేయలేదన్నారు. దీంతో రైతుబంధుతో పాటు సంక్షేమ పథకాలు అందడంలేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉమ్మడి సర్వేచేసి కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు.

◆ **కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె**

ఝరాసంగం(జహీరాబాద్): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. శుక్రవారం ఝరాసంగం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

◆ **రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన**

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల గ్రామంలోని మన్నెగూడెం కాలనీలో రూ. 10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ ప్రారంభించారు.

◆ **చైర్మన్‌ను కలిసిన నాయకులు**

వట్‌పల్లి(అందోల్): రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతిని జోగిపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం సంగారెడ్డిలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలను తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ ఎర్రగొల్ల మహేష్ యాదవ్, నాయకులు బీర్ల శంకర్ యాదవ్, ఉప నాగరాజు, కడాల ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

◆ **సభ్యత్వ నమోదు**

నారాయణఖేడ్: పట్టణంలో శుక్రవారం వీరశైవలింగాయత్ సమాజ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్‌తో పాటు సాగర్ షెట్కార్, సతీష్ షెట్కార్, కల్యాణి అశోక్, శేఖర్, మనోహర్, మాలిపటేల్ శివకాంత్, సంతోష్ పటేల్, దిగ్వాల్ సాయి తదితరులు లింగాయత్‌లను కలిసి సభ్యత్వ నమోదు చేయించారు.